రేపటి నుంచి విజయవాడలో 144 సెక్షన్

విజయవాడస్పోర్ట్స్: శాంతి భద్రతలను పరిరక్షించేందుకు విజయవాడ సిటీ పరిధిలోని ప్రాంతాల్లో గురువారం నుంచి 50 రోజుల పాటు 144(2) సీఆర్‌పీసీ కింద నిషేదాజ్ఞలను అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్ టౌన్, టూ టౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. నలుగురు, అంతకు మించి వ్యక్తులు ఒకే ప్రదేశంలో గూమిగూడినా, కర్రలు, ఇతర మారనాయుధాలతో సంచరించినా, నిబంధనలను అతిక్రమించినా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మళ్లీ జగనే సీఎం.. అదే ప్రజల ఆకాంక్ష

- మంచి చేస్తున్న ముఖ్యమంత్రికి అన్ని వర్గాల నుంచి ఆదరణ
- బొండా వంటి పెత్తందారులు ప్రజలకు అవసరం లేదు
- బాబు, లోకేష్, పవన్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారో తెలియదు
- గడపగడపకు పాదయాత్రలో సెంట్రల్ ఇన్‌చార్జి వెలంపల్లి



గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజలకు ఎవరు మంచి చేస్తే వారినే ఆదరిస్తారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నాలుగున్నరేళ్లుగా సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. గడపగడపకు పాదయాత్రలో భాగంగా సెంట్రల్ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తల సమన్వయంతో బుధవారం 24వ డివిజన్‌లోని గిరిపురంలో వెలంపల్లి శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న హయాంలో అందరికీ మేలు జరుగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా అమలు చేస్తుంటే పచ్చమీడియా పచ్చకామెర్లు వచ్చినట్లు దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రజల వద్దకు వెళ్తుంటే ప్రతి ఇంట్లో మళ్లీ జగనే కావాలని కోరుతున్నారన్నారు. బొండా ఉమా వంటి పెత్తందారులు ఈ నియోజకవర్గానికి అవసరం లేదన్నారు. ఉదయం ఎండని, సాయంత్రం చంద్రుడిని చూడని వ్యక్తి బొండా ఉమా అని ఎద్దేవా చేశారు. ర్యక్రమంలో ఎమ్మెల్సీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, పార్టీ స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం గురువారం ప్రారంభం కానుంది. 58వ డివిజన్ ఆంధ్రప్రభ కాలనీ, మూడు రోడ్ల సెంటర్ సాయిబాబాగుడి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రారంభించనున్నారు. ముఖ్యఅతిథులుగా మంత్రి జోగి రమేష్, ఎంపీ కేశినేని నాని, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, తలశిల రఘురాం, ఎండీ రుహుల్లా హాజరవుతారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.


ముగిసిన సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సు శిక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన స్కిల్ హబ్ ద్వారా జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ముగింపు సందర్భంగా పెట్టిన పరీక్షల్లో 22 మందికి గానూ 21 మంది ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, స్కిల్‌హబ్ నుంచి విజయ దీప్, హబ్ ఇన్‌చార్జ్ తారక రవి తేజ, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ట్రైనర్ శారదా లక్ష్మి పాల్గొన్నారు.

చంద్రికా నాయుడుకు అభినందన

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ఏలూరు రోడ్డు శ్రీచైతన్య కళాశాల రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్‌లో బుధవారం తైక్వాండో జాతీయస్థాయి పోటీల్లో పూమ్‌సే విభాగంలో రజత పతకం సాధించిన చంద్రిక నాయుడు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చంద్రిక నాయుడును, కోచ్ ఎం.అంకమ్మరావును ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ ఎస్.గోకర్ణేశ్వరరావు, డీన్ గుంటూరు హరిబాబు,వైస్ ప్రిన్సిపాల్ వై.నీలిమ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నున్న సీఐగా దుర్గాప్రసాద్



పాయకాపురం(విజయవాడరూరల్): నున్న రూరల్ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.దుర్గాప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన ఏలూరు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. బుధవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన కాగిత శ్రీనివాసరావు ఏలూరు రేంజ్‌కి బదిలీ అయ్యారు.

సరితారాణి కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మైలవరం మండలం వెల్వడం జెడ్పీ హైస్కూల్లో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న మండలపు సరితా రాణి గతేడాది అక్టోబర్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సరితా రాణి భర్త కె.శ్రీనివాసరావు, కుమార్తె కె.జాహ్నవిలకు కలెక్టర్ ఢిల్లీరావు అందజేశారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మహేశ్వర రావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటలు, వంటల పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక రామకృష్ణాపురంలో బుధవారం ఇందిరా మహిళా మండలి వార్షిక వేడుకలలో భాగంగా మహిళలకు వంటలు, ఆటల పోటీలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ గవర్నర్ జేఎన్ వీఎల్ సుజాత, భారతీ మహిళా మండలి సభ్యురాలు విజయలక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం మహిళలకు క్యాచ్ ద బాల్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, లెమన్ బ్యాలెన్స్ వాక్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 26వ తేదీ శుక్రవారం బహుమతి ప్రదానం చేస్తామని మహిళా మండలి అధ్యక్షురాలు కె.మాధవీలత తెలిపారు.

ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

విజయవాడకల్చరల్: సాంస్కృతిక సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు దోగిపర్తి శంకరరావు అన్నారు. గాంధీనగర్‌లోని గ్రంథాలయంలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పలువురు కళాకారులకు దంతవైద్యుడు డాక్టర్ ఓబుల్‌రెడ్డి దంత సమస్యలకు పరిష్కారంతో పాటు ఉచితంగా మందులను అందజేశారు.

శాంతినగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

పాయకాపురం(విజయవాడరూరల్): శాంతినగర్ లోని మోటూరు వారి కల్యాణమంటపంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత వైద్యశిబిరం జరిగింది. శిబిరంలో మొత్తం 423 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, వైద్యులు నరేంద్రనాయక్, మధురిమ, కె.హరీష్, ఎండి అమీర్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో లోపాలు లేకుండా చూడాలి



హెడ్ వాటర్ వర్క్సులో నీటి శుద్ధిని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి లోపాలూ లేకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన బుధవారం భవానీపురంలోని వీఎంసీ హెడ్‌వాటర్ వర్క్స్ పనితీరును పరిశీలించారు. నీటిని శుద్ధి చేసే ఫిల్ట్రేషన్ బెడ్లను తరచుగా శుభ్రపరచి, స్వచ్ఛ నీటిని ప్రజలకు అందించాలని ఆదేశించారు. అవసరమైతే కార్మికులను మరింతమందిని పెంచాలని ఆదేశించారు. వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, ఎస్ఈ (ప్రాజెక్ట్స్) రామ్మోహనరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు పరిశీలన

నగరంలోని ఇన్నర్‌రింగ్ రోడ్డును మరింత అభివృద్ధి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం అజిత్‌సింగ్ నగర్‌లోని ఇన్నర్‌రింగ్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రింగ్‌రోడ్డును మరింత శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు వీఎంసీ ఆధ్వర్యంలో ప్రాజెక్టుకు శ్రీకారం చేయబోతున్నామని తెలిపారు. స్థానికంగా చేపట్టాల్సిన జంక్షన్ల అభివృద్ధికి సంబంధించి నివేదికను తనకు సమర్పించాలని సూచించారు. ఈ పర్యటనలో వీఎంసీ సర్కిల్-2 ఈఈ శ్రీనివాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, ఆర్అండ్‌బీ డీఈ శశి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

192 మద్యం సీసాలు స్వాధీనం

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్‌నగర్ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వద్ద ఎలాంటి అనుమతులు లేని 192 మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని బుధవారం నున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన కోన గిరీష్‌బాబు ఎలాంటి అనుమతులు లేకుండా 192 మద్యం సీసాలను బైక్‌పై తీసుకొస్తుండగా ఎస్ఐ గోవిందు,సిబ్బంది అతన్ని తనిఖీ చేసి బైక్‌ను, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతను ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం కండ్రికకు చెందిన శీతు రామకృష్ణ అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకొని వారిద్దరి పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో చోరీ కేసులో ఆరు నెలల జైలు

విజయవాడస్పోర్ట్స్: విద్యాధరపురం ఐరన్ యార్డ్ వద్ద ఆటోను చోరీ చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.రాజశేఖర్ బుధవారం తీర్పు చెప్పారు. గత ఏడాది జూలై 9న యార్డు ఎదుట ఆటో నిలిపి యార్డులోకి వెళ్లి వచ్చేసరికి ఆటో కనపడలేదు. ఆటో యజమాని ఫిర్యాదుమేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడుకు చెందిన కారం నరేష్‌ను నిందితుడిగా గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టులో వాదనలు వినిపించారు. ముగ్గురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు నరేష్‌కుపై విధంగా శిక్ష విధించారు.